క్లుప్తంగా

ఘనంగా బలిజపల్లి గంగమ్మ జాతర



పూజలందుకుంటున్న బలిజపల్లి గంగమ్మ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని శివశంకరాపురం గ్రామంలో ఆదివారం బలిజపల్లి గంగమ్మ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని పునర్నిర్మించి మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి చివరిరోజు పెద్దఎత్తున జాతరను జరుపుకున్నారు. జాతరలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. పూజారులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముక్కా సాయివికాస్‌రెడ్డి గంగమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయించారు.

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేని కాల్వ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మను ఆదివారం ఉదయాన్నే పూజారులు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బోయనపల్లెలో కార్డెన్ సెర్చ్



విద్యార్థుల గదులలో సోదా చేస్తున్న పోలీసులు

రాజంపేట : న్యూ బోయనపల్లె(ఇంజనీరింగ్ విద్యాసంస్థల ఏరియా)లో ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే నేతృత్వంలో మన్నూరు సీఐ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ కొనసాగించారు. విద్యార్థుల గదులతో పాటు లేడీస్, బాయ్స్ హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. అలానే మన్నూరు పోలీసులతో గ్రామంలో విస్తృతంగా తనిఖీలు చేశారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

రాయచోటి టౌన్ : పట్టణంలోని బంగ్లా సర్కిల్ వద్ద మస్తాన్ సెల్ పాయింట్ వద్ద ఆ షాపు యజమాని మస్తాన్ వలీ ఆర్థిక సహకారంతో మానవత ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని మానవత సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి ప్రారంభించారు. మండే ఎండల్లో వివిధ పనులకోసం రాయచోటి వచ్చే వారి కోసం మంచి నీరు అందించడం తమసంస్థ నిర్వహించే సేవా కార్యక్రమాలలో భాగమేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగర సాంబశివ, సంజీవకుమార్, మస్తాన్, కొయ్యల వీరయ్య, టేకూరి నాగార్జున, మానవత చైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, కన్వీనర్ బాబు, గౌరవ సలహాదారుడు వెంకటరమణ, కో చైర్మన్ షకీల్, మాజీ సెక్రటరీ వెంకట రమణ నాయుడు, నరసింహా రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అష్రఫ్ అలీఖాన్, సుదర్శన్‌రెడ్డి, గంగాధర్ నాయుడు, బీపీ నాగయ్య పాల్గొన్నారు.

50 మంది పిల్లలకు ఉచిత ఖత్నా



ఖత్నా కార్యక్రమంలో నిర్వాహకులు, వైద్యులు

చిన్నమండెం : మండల కేంద్రంలోని సంతబజార్‌లోని మసీదు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఖత్నా కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా 50 మంది పిల్లలకు ఉచితంగా ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మహబూబ్ స్టోన్ క్రషర్ యజమాని షేక్ షఫీవుల్లా తెలిపారు. వైద్యులు డాక్టర్ అబ్దుల్ రజాక్, డా.జాకీర్ బాషాలు చిన్నారులకు ఖత్నా కార్యక్రమాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో మస్తాన్‌వలీ, సాదిక్, మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని రాహిద్ మసీదులో ఆదివారం ఉదయం దాదాపు 100 మందికి పైగా ముస్లిం పిల్లలకు జామియత్ ఏ ఇత్తెహాదుల్ హింద్ ఆధ్వర్యంలో సున్తీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి చైర్మన్ షేక్ ఖాదర్ బాషా, లక్కిరెడ్డిపల్లి ఎస్‌ఐ రవీంద్ర బాబు, ఆర్‌ఎంపీ షఫీ నాయక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సున్తీ చేసిన ముస్లిం పిల్లలకు షఫీ నాయక్ ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ధరణి కుమార్, ఇర్ఫాన్, బాబ్జీ, ముఖరమ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు వడదెబ్బ ముప్పు

- అప్రమత్తత అవసరమంటున్న అధికారులు
- నివారణా చర్యలు తీసుకోవాలంటూ సూచన



వీరబల్లి మండలంలో పశువుల కోసం పాడి రైతు ఏర్పాటు చేసుకున్న షెడ్డు

రాయచోటి జగదాంబసెంటర్ : ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదవుతుండటంతో పశువులకు వడదెబ్బ ముప్పు పొంచి ఉంది. ఎండ తీవ్రత కారణంగా పశువులు వడదెబ్బ బారిన పడే ఆస్కారం అధికంగా ఉందని.. పశుపోషకులు వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. పశువులు వడదెబ్బ బారిన పడే పరిస్థితులు, చికిత్స, నివారణ చర్యలను పాడి రైతులకు తెలియజేస్తున్నారు. వాతావరణంలో ఉష్ణోగ్రత ఎక్కువైనప్పుడు పశువు మెదడులోని హైపోథలామస్ అనే భాగం స్వేద గ్రంథుల మీద పర్యవేక్షణ కోల్పోతుంది. దీని వల్ల స్వేద గ్రంథులు చెమటను అధికంగా ఉత్పత్తి చేస్తాయి. చెమట ద్వారా శరీరంలోని ధాతువులు ఉప్పు ఎక్కువగా కోల్పోయి జీవక్రియ దెబ్బతింటుంది. శరీర ఉష్ణోగ్రత పెరిగి శ్వాస, గుండె, నాడి, మూత్రపిండాల విధులు తగ్గిపోయి పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి కోమాలోకి జారుకుని శ్వాస ఆడక మరణిస్తాయి.

వడదెబ్బ లక్షణాలు, చికిత్స

- ఆవుల్లో శరీర ఉష్ణోగ్రత 103 డిగ్రీల సెల్సియస్‌కు మించుతుంది. చర్మం మృదుత్వం తగ్గిపోయి గట్టి పడుతుంది. నోటితో గాలి పీల్చుకోవడం, నోటి వెంట చొంగ కారడం జరుగుతుంది. ఆవులలో పాల దిగుబడి, పునరుత్పత్తి, చూడుకట్టే శాతం తగ్గి గర్భస్రావం అయ్యే అవకాశం ఉండగా, ఎద్దులో వంధ్యత్వం వస్తుంది. తీవ్రత ఎక్కువ అయినప్పుడు పక్షవాత లక్షణాలు సంభవించి క్రమంగా కోమాలోకి వెళ్లి మరణిస్తాయి.
- వడదెబ్బకు గురైన పశువులను వెంటనే నీడ ప్రాంతానికి మార్చి వీలైతే ఫ్యాన్లు లేదా కూలర్ల సాయంతో చల్లని గాలి అందించాలి. బాగా ఎండగా ఉన్న సమయాల్లో పశువులను చల్లని నీటితో పలుసార్లు కడగాలి. చల్లని నీరు తాగడానికి అందుబాటులో ఉంచి నొప్పులను తగ్గించడానికి నివారణ(అనాల్జేసిక్) మందులను వాడాలి. రక్తంలోకి డెక్స్‌ట్రోజ్ సెలైన్, లవణ ద్రావణాలు ఎక్కించాలి.

వడదెబ్బ నుంచి పశువుల సంరక్షణ

వేసవిలో పశువులు వడదెబ్బ బారిన పడకుండా గంటకు ఒకసారి పశువులను నీటితో తలతో సహా తడపాలి. తాగునీటికి ఉపయోగించని కుంటల్లో పశువులను వదలాలి. నీటి వసతి ఉన్న పాడి రైతులు రోజుకు నాలుగైదు సార్లు పశువులను నీటితో తడపాలి. వేడిగాలి తగలకుండా పశువుల పాక చుట్టూ గోనె సంచులు కట్టి వాటిని నీటితో తడుపుతుండాలి. పశువుల పాకల్లో తుంపర్లను చిమ్మే నీటి పైపులను ఏర్పాటు చేసి నీటిని నిల్వ చేసిన తొట్టి నుంచి చిన్న మోటారు సాయంతో నీటిని పైపుల ద్వారా తుంపర్ల రూపంలో వదలాలి. పశువుల పాకకు సమీపంలో భవనంపై నీటి తొట్టిని ఏర్పాటు చేసుకుని వాటిని పైపులతో పశువుల పాకలోకి అమర్చి స్ప్రింక్లర్లతో మోటారు లేకుండా నీటిని చల్లవచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఎండ తగ్గే వరకు రెండు గంటలకోసారి పది నిమిషాల పాటు నీటిని చల్లాలి. పశువులకు వడదెబ్బ తగిలితే వెంటనే దగ్గరలోని పశువైద్యాధికారిని సంప్రదించాలి. వేసవిలో పశువులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య మేతకు వదలకూడదు. తాగేందుకు చల్లని తాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి. కొట్టాలను బాగా ఎత్తుగా నిర్మించుకుని పైన ఎండుగడ్డితో కప్పి ఎండగా ఉన్న సమయాల్లో దాని మీద నీళ్లు చల్లుతుండాలి. పశువుల పాకల్లో వడగాలి వస్తున్న దిక్కుల్లో గోనె సంచులు కట్టి నీళ్లు చల్లుతుండాలి. నీటి శాతం ఎక్కువగా ఉన్న మేపు (పచ్చిగడ్డి, పాతరగడ్డి, హైడ్రోఫోనిక్స్ గడ్డి) పెట్టాలి. మరీ ఎక్కువగా దాణా, ఉడికించిన ధాన్యాలు పెడుతున్నపుడు కొంచెం వంట సోడా కలపడం వల్ల ఎండవేడిమికి గురైన పశువుల్లో వచ్చే అజీర్తి సమస్యలను నివారించవచ్చు.

వడదెబ్బ తగలడానికి ముఖ్య కారణాలు

- గాలిలో తేమశాతం అధికంగా ఉండటం
- వాతావరణ ఉష్ణోగ్రత పెరగడం
- పశువులు పాక సామర్థ్యానికి మించి ఉండటం
- నీటి లభ్యత తక్కువగా ఉన్నప్పుడు
- వడగాలులు వల్ల, పశువులు ఒత్తిడికి లోనవడం వల్ల

జాగ్రత్తలతో వడదెబ్బ తగలకుండా చూడవచ్చు



ప్రస్తుతం ఎండలు భగభగమండుతున్నాయి. పాడి రైతులు చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే పశువులకు వడదెబ్బ తగలకుండా చూసుకోవచ్చు. పశుసంవర్థక శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. పశువులకు అప్పుడప్పుడూ నీటితడిని అందిస్తే పశువులు వడదెబ్బ బారిన పడకుండా ఉంటాయి.

- గుణశేఖర్ పిళ్లై, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

గంగమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు చెల్లు వంశీయులు గంగన్న, సురేంద్ర కుటుంబ సభ్యులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసులు భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు.

29న ఊటుకూరులో ఉద్యాన సమ్మేళనం

సిద్దవటం : ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించేందుకు ఈనెల 29వ తేదీన ఊటుకూరులోని మాధవీ కన్వెన్షన్ హాల్‌లో ఉద్యాన సమ్మేళన కార్యక్రమం జరుగునని మండల ఉద్యాన శాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. సిద్దవటంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యాన శాస్త్రవేత్తలతో పంట సాగుపై ప్రసంగాలు, ఉద్యాన రంగంలో ఉన్న వివిధ నిష్ణాతులచే ప్రసంగాలు, ఆధునిక సాంకేతికతపై ప్రసంగాలు, రైతులు, వ్యాపారస్తులు, ఎగుమతిదార్లతో మార్కెటింగ్ అనుసంధానం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఉద్యాన రంగంలో నూతన సాంకేతిక, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాతావరణంలో మార్పులు, మార్కెటింగ్ అంశాలపై ప్రధానంగా చర్చిస్తారన్నారు. అవగాహన సదస్సుకు రైతులు హాజరై సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా కుడమలూరు అంకాలమ్మ తిరునాల



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి



ప్రత్యేక అలంకారంలో కుడమలూరు అంకాలమ్మ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కుడమలూరు గ్రామంలో వెలసిన అంకాలమ్మ తిరునాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. వేకువజామున అంకాలమ్మ తల్లికి అర్చకులు పంచామృతాభిషేకాలు నిర్వహించి పట్టువస్త్రాలు సమర్పించి సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

తిరునాల పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ రెడ్డి చేతులమీదుగా బండలాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో ఐదు జత ఎద్దు పాల్గొన్నాయి. మొదటి బహుమతి కడప జిల్లా చాపాడు మండలం, రాజువారిపేటకు చెందిన లింగారెడ్డి శ్రీకాంత్ రెడ్డి ఎద్లు, ద్వితీయ బహుమతి ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లి గ్రామానికి చెందిన మార్తాల వెంకట సుబ్బారెడ్డి ఎద్లు, తృతీయ బహుమతి అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం వరదాయపల్లికి చెందిన బెస్త శ్రీరాముల ఎద్లు, నాల్గో బహుమతి వేంపల్లి మండలం రాజులపేట గ్రామానికి చెందిన పసుపులేటి రమణయ్య ఎద్లు, చివరి స్థానంలో నిలిచిన కడప జిల్లా మైదుకూరు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన మూలే సూరారెడ్డి ఎద్లు నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు టక్కోలు శివారెడ్డి, రాజంపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ అధ్యక్షుడు ఓబుల్ రెడ్డి, కొండమాచుపల్లి సర్పంచ్ మేరువ శివ నారాయణ, గ్రామ పెద్దలు రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పట్ల అలసత్వం వద్దు



కౌన్సిలర్‌లతో సమావేశమైన ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహించొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మున్సిపల్ కౌన్సిలర్‌లకు సూచించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం రాజంపేట మున్సిపల్ కౌన్సిలర్‌లతో ఎమ్మెల్యే ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో ప్రజలకు వారు ఎంతమటుకు సహకరిస్తున్నారో ఆరా తీశారు. అధిక ఉష్ణోగ్రతలు ఉన్నందున తాగునీటి సమస్యలు ఎక్కడైనా తలెత్తినాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డీలర్ సుబ్బరామిరెడ్డి, పట్టణ కన్వీనర్ జీవీ కృష్ణారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవికుమార్, కౌన్సిలర్, సీనియర్ నాయకులు పోలా వేంకటరమణారెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ రాముయాదవ్, కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆకేపాటికి జుబేర్ కృతజ్ఞతలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్టూడెంట్ విభాగం జాయింట్ సెక్రటరీగా నూతనంగా నియమితులైన షేక్ జుబేర్ కృతజ్ఞతలు తెలియజేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు విద్యార్థి నాయకులతో ఆదివారం కలిసి వచ్చిన జుబేర్ ఎమ్మెల్యే ఆకేపాటిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు ఇర్ఫాన్, సునీల్‌రెడ్డి, ఆసీఫ్, యశ్వంత్‌వర్మ, ఎ.తేజ, శశి తదితరులు ఉన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి అమానుషం



రైల్వేకోడూరు అర్బన్: గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న క్రైస్తవులు

రాయచోటి టౌన్ : ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని పొట్టన పెట్టుకోవడం పిరికింద చర్యని మానవత సేవా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి ప్రతిభ జూనియర్ కళాశాల ఆవరణలో రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షులు ఎస్. ప్రభాకర్‌రెడ్డితో కలసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పహల్గామ్‌లో అమాయక పర్యాటకులపై దాడి అమానుషమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిని వారికి సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. అనంతరం మానవ సేవా సంస్థలో విశేష సేవలు అందించిన వారిని ఘనంగా సన్మానించారు.

ఉగ్రవాదులను మట్టుబెట్టాలి

రైల్వేకోడూరు అర్బన్ : ఉగ్రవాదులను మట్టుపెడితేనే పహల్గామ్ ఉగ్రవాద దాడిలో అసువులు బాసిన వారి కుటుంబాలకు న్యాయం జరిగినట్లని స్థానిక లూథరన్ చర్చి సభ్యులు తెలిపారు. ఆదివారం ఆ సంఘం ఆధ్వర్యంలో క్రైస్తవులు నిరసన చేపట్టి గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగ్రవాద దాడులలో 26 మంది టూరిస్టులు చనిపోవడం బాధాకరమన్నారు. ఉగ్రవాదానికి మద్దతిస్తున్న పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాలెం భాను, భాస్కర్, ప్రకాష్, సల్మాన్, ప్రభాకర్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

షికారుపాలెంలో నాకాబందీ

వీరబల్లి : మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ షికారుపాలెంలో ఆదివారం రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో వీరబల్లి ఎస్‌ఐ మోహన్ నాయక్, సుండుపల్లి ఎస్‌ఐ, పోలీసు సిబ్బందితో కలిసి నాకాబందీ నిర్వహించారు. అనుమానితులను గుర్తించడమే కాకుండా ఇండ్లను సోదా చేశారు. అలాగే రికార్డులు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే ఓ వ్యక్తి అక్రమంగా పది మద్యం బాటిళ్లు కలిగి ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

దాతల సహకారం అభినందనీయం

లక్కిరెడ్డిపల్లి : దాతల సహకారంతో అభాగ్యులకు మానవత సేవా సంస్థ ఉచిత సేవలు అందించడం అభినందనీయమని మానవత కేంద్ర కమిటీ సభ్యులు వై ప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని స్థానిక నలందా విద్యానికేతన్ పాఠశాలలో మానవత సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో పహల్గామ్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం చైర్మన్ బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ మానవత సంస్థ మంచి విలువలతో కూడిన సంస్థ అని, సంస్థ చేసే కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. లక్కిరెడ్డిపల్లి గ్రామంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబానికి సంస్థ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కో–చైర్మన్ శివశంకర్ రెడ్డి, మానవత అధ్యక్షులు షఫీ నాయక్, కన్వీనర్ ఆర్.శివయ్య, కోశాధికారి రవిశంకర్, డైరెక్టర్స్ రమణారావు, శ్రీరాములు, రామాంజనేయులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ కొండూరు వెంకటరామరాజు, మానవత సభ్యులు రవి శంకర్, చిన్న రమణ, సాయి చరణ్ యాదవ్, విశ్వనాథ్, గంగయ్య, జయన్న, రెడ్డయ్య, వెంకట కృష్ణ, సుబ్బయ్య, శ్రీనివాసులు, కిరణ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో ఐక్యపోరాటాలను ఉధృతం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత ఎ.రామాంజులు

రాయచోటి అర్బన్ : మేడేను పురస్కరించుకుని అమరవీరుల స్ఫూర్తితో ఐక్యపోరాటాలను ఉధృతం చేద్దామని, నయా ఉదార విధానాలను ప్రతిఘటిద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు అన్నారు. మేడే ఉత్సవాల నిర్వహణపై ఆయన ఆదివారం పార్టీ నేతలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను ఒక పండుగలా కాకుండా దీక్షా దినంగా జరుపుకోవాలన్నారు. మే డే పోరాట స్ఫూర్తితో పెట్టుబడిదారులు, కార్పొరేట్, మతోన్మాదులు, దోపిడీదారులు, అణచివేతలు, వివక్షలకు వ్యతిరేకంగా వర్గపోరాటాలను ఉధృతం చేస్తామంటూ పిలుపునిచ్చారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. కార్మిక వర్గం సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్‌కోడ్‌లుగా రూపొందించి కార్మికుల దోపిడీకి సహకరిస్తోందన్నారు. దోపిడీ నుంచి విముక్తి కలిగించే ప్రత్యామ్నాయ సమాజాన్ని నిర్మించడంలో తాము నిర్వహించాల్సిన పాత్రపై కార్మికవర్గానికి సీఐటీయూ అవగాహన కల్పించేందుకు కృషిచేస్తోందంటూ తెలిపారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, విద్యుత్‌కార్మిక సంఘం నేత సుబ్రమణ్యంరాజు, మున్సిపల్ నేతలు చెన్నయ్య, రాంబాబు, అంగన్‌వాడీ సిద్దమ్మ, సీఐటీయూ మాధవయ్యతో పాటు పలు అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అరెస్టుల పర్వంతో అరాచక పాలన

- చిత్తశుద్ధితో సబ్‌స్టేషన్‌లు పూర్తి చేయండి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని కూటమి నాయకులు కుట్రలు, కుతంత్రాలు మాని తమ ప్రభుత్వంలో మంజూరు చేయించిన 9 విద్యుత్ సబ్ స్టేషన్‌లలో పూర్తికాని వాటిని పూర్తి చేయాలని శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్నికైన ఎమ్మెల్యేకి అధికారం లేకుండా కేవలం కూటమి నాయకులు పెత్తనం చేస్తూ కేవలం తమతమ వర్గాల బలోపేతానికి పాటుపడుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లి, పుల్లంపేట, చిట్వేలి, పెనగలూరు మండలాలలో రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో 9 సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయించి ఐదు సబ్ స్టేషన్‌లు పూర్తి చేశామని చిత్తశుద్ధి ఉంటే మిగిలినవి పూర్తి చేయాలని చెప్పారు. బాల్‌రెడ్డిపల్లిలో సబ్‌స్టేషన్ నిర్మాణం ఎక్కడవేసిన గొంగలి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. చిట్వేలి మార్గోపల్లిలో సబ్‌స్టేషన్ పనులు చేయకుండా అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. అది ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్టులు చేస్తూ అరాచక పాలన చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు అభివృద్ధి సంక్షేమం అందిచకుండా రాజకీయాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఉంటూ వారి సమస్యలు పరిష్కారానికి పోరాడుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, సీహెచ్ రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

దుమ్మెత్తిపోయ్.. దుష్ప్రచారం చేసేయ్!

- వైఎస్సార్‌సీపీ నాయకులపై ఎల్లో పత్రికల అసత్య కథనాలు
- పాలన చేతకాకే ఆరోపణలంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాజంపేట రూరల్ : ప్రజా రంజక పాలన సాగించలేని కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులపై కనికట్టు చేసినట్లు పత్రికల ద్వారా విషప్రచారం చేయటంపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటంతో ప్రజలు తిరగబడతారనే భయంతో ఎక్కడికక్కడ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులపై బురద జల్లేందుకు కూటమి నాయకులు తెరతీశారనేది సగటు ఓటరు మనోభావం. అధికారంలోకి వచ్చిన వెంటనే శ్రీమహా విష్ణువు కొలువై ఉన్న తిరుమల వేంకటేశ్వరస్వామి మీద నిందలు వేసిన కూటమి నాయకులకు మచ్చలేని వైఎస్సార్‌సీపీ నాయకులపై నిందలు వేయటం వెన్నతో పెట్టిన విద్య కదా అని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ రాజంపేటలో కొనసాగుతున్న అసత్యపు విష ప్రచారం. ఒక వీఆర్‌ఓ స్థాయి అధికారిణిని నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ నాయకుడు బెదిరించాడని కూటమి నాయకులు ఒక విష ప్రచారం సృష్టించారనేది వైఎస్సార్‌సీపీ కార్యకర్తల బలమైన ఆరోపణ. ఈ నిజం లేని ఆరోపణలను కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న కొన్ని ప్రతికలలో లేనిది ఉన్నట్లుగా భ్రమించే విధంగా కథనాలు వండివార్చారని వైఎస్సార్‌సీపీ వర్గాలు మండిపడుతున్నాయి. వీఆర్‌ఓ స్థాయి అధికారిణి బెదిరిస్తే ఆ అధికారిణి పోలీసులను ఎందుకు ఆశ్రయించలేదని సగటు మనిషి ప్రశ్న. అధికారులను అడ్డం పెట్టుకొని మైండ్ గేమ్ ఆడటం అనేది ఇటీవల కూటమి నాయకులు చేపట్టిన చీప్ ట్రిక్‌గా వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులను అడ్డంపెట్టుకొని వైఎస్సార్‌సీపీ నాయకులను మానసికంగా హింసిస్తున్నారనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ స్థాయిలో బలమైన వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేస్తే క్యాడర్‌ను నియంత్రించవచ్చనేది కూటమి నాయకుల పన్నాగమని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడుతున్నారు. ఎన్నికల హామీలను అమలు పరిచి ప్రజలకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం ప్రజల పక్షాన గొంతుకుగా వినిపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులను అప్రతిష్ట పాలు చేయటానికి పూనుకోవటం రాజకీయానికి మాయనిమచ్చని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. వైఎస్ కుటుంబంకు వీర విధేయులగా ఉన్న వారిని వేధిస్తే కూటమి ప్రభుత్వానికి ఒరిగేదేమీ లేదని వారు బాహాటంగా తెలియజేస్తున్నారు.

వన్యప్రాణులకు నీరు ఏర్పాటు



సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్న అటవీ సిబ్బంది

సిద్దవటం : వేసవి నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకొని సిద్దవటం రేంజ్‌లోని అటవీ పరిసరాల్లో వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేసినట్టు రేంజర్ కళావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో వన్యప్రాణులు, అడవి జంతువులు తాగునీటి కోసం గ్రామాల్లోకి రాకుండా కడప డీఎఫ్‌ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు సిద్దవటం రేంజ్ పరిధిలోని ముత్తుకూరు, కొండూరు సిద్దవటం, గొల్లపల్లె, మరికొన్ని బీట్లలోని అటవీ ప్రాంతాల్లోని సాసర్ పీట్లతో పాటుగా, పలు నీటి కుంటల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. అటవీ జంవుతులకు హాని తలపెట్టినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులేస్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

శీతల పానీయం.. దప్పిక తీర్చే



అనంతంపల్లిలో శీతల పానీయంతో దాహం తీర్చుకుంటున్న వానరం

పుల్లంపేట : సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక వింతలు, విశేషాలకు కొదవలేకుండా పోయింది. ఎక్కడికైనా వెళ్లినప్పుడు వింత సంఘటనలు చూస్తే టక్కున ఫోన్ తీసి కెమెరాలో దాన్ని బందిస్తారు. తాజాగా ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. తాగునీటి కోసం మనుషులే కాదు వానరాలకు సైతం నీటి కష్టాలు తప్పడం లేదు. వివరాల్లోకి వెళ్తే పుల్లంపేట మండలం అనంతంపల్లి గ్రామంలో ఆదివారం ఓ శుభకార్యం జరుగుతుండగా ఓ వానరం ఇంటి గోడపై కూర్చొని అలా ఇలా చూస్తోంది. ఓ పెద్దాయన తన వద్ద ఉన్న థమ్స్‌అప్ బాటలు వానరానికి ఇవ్వడంతో దాహంతో ఉన్న వానరం బాటిల్‌లో ఉన్న థమ్స్‌అప్‌ను తాగి తన దాహం తీర్చుకుంది.